


# శ్రుతి తప్పిన మనిషి

శ్రీకంఠమూర్తి

"జగన్నాథం.... జగన్నాథం...."

"జగన్నాథం....నిన్నే...."

పిలుపు మరీ నా వెనుకనుంచే వినబడింది. వెనుతిరిగి చూశాను. ఎవరో ఒకతను నన్నే ఆ పేరుతో పిలుస్తున్నాడు.

"ఎవరు నువ్వు?" అనడిగాను.

"నన్నే ఎవరివని అడుగుతున్నావా? బావుంది. నన్నెరగవూ?"

ఆతని మాటలకు తెల్లబోయాను.

"ఎవరయ్యా నువ్వు?...." మళ్ళీ అడిగాను.

"ఈ గోపాలాన్నే ఎరగనట్టు నటి

స్త్రావేం జగన్నాథం....'' అన్నాడు నా చొక్కా పట్టుకుంటూ.

''నా చొక్కా పట్టుకుంటావెందుకు? ఇంతకూ నీ జగన్నాథాన్ని కాను తెలిసిందా?'' అన్నాను కోపంతో.

''అవున్లే....నువ్వే కాదు, ఈ ప్రపంచంలో ఎవరూ నా వాళ్లు కారు. అమ్మ పోయింది. నాన్న పోయాడు. చివరికి నా పార్వతి కూడా నాకన్యాయం చేసి వెళ్ళిపోయింది. ఇహ నా కూతురు వసుంధర వుండీ కూడా నన్ను గుర్తించలేని స్థితిలో వుంది. అలా జరగడానికి కారణం నేనే!''

అతను ఏడుస్తున్నాడు. ఏడుస్తూనే నా చెయ్యి పట్టుకున్నాడు.

''ముందు నా చెయ్యొదలు. నే వెళ్ళాలి.'' అన్నాను.

''నేనొదల్ను. నువ్వు నన్ను అపార్థం చేసుకున్నావు. నీ మనసులో వున్న సందేహాలన్నీ తీర్చేదాకా నేను నీ చెయ్యొదల్ను.'' అన్నాడు.

వీడెక్కడో నాకు శనిలా దాపరించాడనుకుని ''అబ్బబ్బ! ఏమిటయ్యా నీ గొడ....నాకు నీ మీద సందేహాలూ లేవు. నువ్వు నాకేమీ చెప్పనూ అక్కర్లేదు. ముందు నా చెయ్యొదలు.'' అన్నాను.

అప్పటికీ అతను నా చెయ్యొదల్లేదు.

''అంత కోపమెందుకు జగన్నాథం? నీ బావమరిదిని నువ్విలాగేనా దులపరించుకునేది?''

నాకు కోపం, ఆశ్చర్యం ఏకకాలంలో కలిగేయి.

''ఎవరికయ్యా నువ్వు బావమరిదివి? ముందు నా చెయ్యొదలు'' అన్నాను విసుగ్గా.

''ఏమయినా సరే నేనొదలను. ఒక వేళ నువ్వు దులుపుకుని వెళ్ళిపోలవాని

> మరువలేని గతస్మృతుల గనిగా మానవుని మేధస్సు రూపొందిన నాడు ఆ వ్యక్తి మనుష్యుల మధ్య మసిలే మతిచలించిన వానిగా పిలవబడుతాడు. కానీ ఆ స్మృతులలోని బాధ ఎందరికర్థమవుతుంది?

చూసినా నేను నీ వెనకాలే అరుస్తూ వస్తాను. 'జగన్నాథం! ఆగు ...జగన్నాథం! ఆగు.' అంటూ. అప్పుడు రోడ్డు మీద పోయేవాళ్ళందరూ నిన్నే కేకలేస్తారు 'పాపం! అతనలా పిలుస్తుంటే వెళ్ళిపోతావేమిటయ్యా? కాస్త ఆగి అతను చెప్పేది వినగూడదూ?' అని. అప్పుడు నీ పరువేమవుతుంది? అప్పుడయినా వింటావా నేను చెప్పేది? ఇదిగో రెండు నిముషాల్లో చెప్పేస్తా....'' అన్నాడు.

అతని మాటలు వింటూంటే అతనన్నంతా చేసినంత పనీ చేసేటట్టు అనిపించింది నాకు.... విధిలేక నిలబడ్డాను.

"ఊఁ....కానీ. అయితే ఒక మాట. నువ్వన్నట్లు రెండు నిముషాల్లో ముగించేయాలి మరి.''

''అలాగే జగన్నాథం....''

'అదిగో, అదే వద్దనేది. నా పేరు జగన్నాథం కాదు, నీ బావమరిదినీ కాను. నువ్వు చెప్పేదేదో త్వరగా చెప్పేసేయ్. వినేసి నా దోవన నేను పోతాను.'' అన్నాను.

''అది కాదు జగన్నాథం....''

''మళ్ళీ అదే మాట!''

''నీ పేరు చెప్పందే నాకు మాట రాదు జగన్నాథం... నువ్వు మొదట్నించీ ఒట్టి తొందర మనిషివి. ఊఁ....అది సరేగానీ మా వసుంధర ఇప్పుడు బాగా పెద్దదయి వుంటుంది కదూ? ఇప్పుడెలా వుంది జగన్నాథం, వసూ? అందంగా వుందా?.... అచ్చం పార్వతిలాగే కనిపిస్తుందేమో కదూ?''

నాకతని మాటలొక్కటీ అర్థం కాలేదు.

''ఏమో నాకు తెలీదు. అయిందా నువ్వు చెప్పడం? నేను వెళ్ళాలి.'' అన్నాను. ఎలాగైనా వదలించుకోవాలి

"నేనింకా మొదలెట్టందే? అయినా జగన్నాథం, నిన్ను చూస్తే నాకు జాలేస్తోంది. ఏదో సాయంకాలం పూట చల్లగా షికారు బయలుదేరిన నిన్ను పాత సంగతులన్నీ కెలికి బాధ పెడుతున్నాను గదూ? హుఁ....ఏం చేస్తాం చెప్పు నా గోడు చెప్పుకోడానికి నువ్వు తప్ప నాకింకెవరున్నారు? ఆఁ అన్నట్లు వసుంధర ఇప్పుడెలా వుంది జగన్నాథం. అచ్చం పార్వతిలాగే వుంది కదూ?''

''పార్వతి అంటే ఎవరు? నీ ఇంకో కూతురా?''

''రామ రామ! ఇదేమన్యాయం జగన్నాథం. వాటీజ్ దిస్? నీ కోపం నాకు అర్థమయింది నీ స్థానంలో నేనున్నా ఇలాగే కోపంగా మాట్లాడే వాణ్ణేమోగాని మరీ ఇంత అన్యాయంగానా? నీ చెల్లెల్ని, నా భార్యని పట్టుకుని కూతురంటావా?.... ఎంత చచ్చిపోతే మాత్రం ఆమెను మరీ ఇంతగా మర్చిపోతావా?''

''ఏమిటీ....పార్వతి నా చెల్లెలా?

బావుంది....చాలా బావుంది. ముక్కూ, మొహం ఎరగని నీ భార్య నాకు చెల్లెలెలా అవుతుంది?''

''ఆపు జగన్నాథం, ఆపు....నా మనసు విలా తూట్లు పొడిచేలా మాట్లాడకు. ఇంత కఠినంగా మాట్లాడడం నీకు తగదు. పోనీ ఇదొక్కటి చెప్పు. నా వసూ బాగుందా?''

''నేనేం చెప్పేది? ఆ వసూ ఎవరో నేను చూస్తే గదా నాకు తెలిసేది?''

''చెప్పు జగన్నాథం....వసూ బాగుందా?''

''ఆఁ....బాగుంది బాగుంది. ఇహ నేను వెళతా ...''

''నేనింకా చెప్పందే....రెండు నిము షాల్లో చెప్పేస్తా. నీ సందేహాలన్నిటినీ తీర్చేస్తా... ''

''నా సందేహాలన్నీ ఎప్పుడో తీరి పోయాయి. బాబూ! నా దారిన నన్ను పోనియ్యి అంతే చాలు.''

''కావాలంటే నీ చెప్పు తీసి నా మొహాన కొట్టు జగన్నాథం, భరిస్తాను. నా బావమరిది నన్ను కొట్టాడని సమాధాన పడతాను. కాని నువ్విలా మాట్లాడితే మాత్రం నేను చాలా బాధ పడతాను'' అతనిలా దైన్యంగా అంటూంటే నా మన సెలాగో అయిపోయింది. అంతకు ముందున్న కోపం కూడా తగ్గిపోయింది ''పాపం? మతి సరిగ్గా లేదల్లే వుంది.... నన్ను తన బావమరిది అనుకుని ఏమేమో చెబుతున్నాడు. పోనీ అతను చెప్పేది వింటే మాత్రం నాకు వచ్చే నష్టమేముంది'' అని నాలో నేనే ఆలోచించుకున్నాను

నేను మౌనంగా వుండడం చూసి అతను నాకు కోపం వచ్చిందనుకున్నా డేమో!

''నువ్వు నన్ను ఎన్నో సార్లు కోప్ప డ్డావు జగన్నాథం! కాని నేను ఎప్పుడైనా నీ చెల్లెల్ని కోప్పడ్డానా? ఒక్కసారి .. కనీసం ఒక్కసారైనా ఆమెను నేనేమన్నా అన్నానా? ...అదసలే మతి లేని మనిషి.

''ఆఁ....మతిలేని మనిషా? '

''ఏం? నీకు తెలీదా నీ చెల్లెలెలాంటి దని నీకు తెలీదా? ఎందుకలా నటిస్తావు? చెప్పు. మా పెళ్ళికి ముందే ఆమెకు పిచ్చట! మా పెళ్ళి కాగానే మా బంధువర్గ మంతా నిన్నూ. నీ వాళ్ళనూ ఎంతగా ఆడిపోసుకున్నారో మర్చిపోయావా? పిచ్చి చెల్లెల్ని గోపాలం లాంటి అమాయకుడి మెడకు కట్టి ఆమె బాధ విరగడ చేసు కున్నాడు జగన్నాథం. ఒట్టి మోసగాడు!' అని ఇంకా ఏమేమో అన్నారు నిన్ను.... అదంతా మర్చిపోయావా? కాని నేనోమాట చెప్పనా జగన్నాథం. మోసగించడానికీ, మోసగింపబడడానికీ మనమెవరం చెప్పు. ఆ బ్రహ్మదేవుడు ఎవరికి ఎవరితో ముడి వేశాడో వారితోటే జరుగుతుంది వివాహం. నువ్వు నన్ను మోసగించావనేది ఉట్టి

భ్రమ. పార్వతి నాభార్య. నేనామె భర్తని. ఇదే నిజం. అంతే!''

అంత కంతకూ అతనిమీద సాను భూతి అధికమవసాగింది నాకు.

''అలా పార్కులో కెళ్ళి బెంచీమీద కూర్చొని మాట్లాడుకుందాం పద'' అంటూ పార్కువైపు నడిచాను. అతనూ నన్ను నుసరించాడు ఇద్దరూ బెంచీ మీద కూర్చున్నాం

''ఆ తరువాత నాకు ఎంతోమంది సలహా ఇచ్చారు జగన్నాథం. నువ్వు అన్యాయంగా మోసపోయావు గోపాలం. ఆమెను వదిలేసి హాయిగా మరొకఅమ్మా యిని పెళ్ళిచేసుకో. చట్టరీత్యా ఆమెనుంచి విడాకుల తీసుకుని ఆమెను పుట్టింటికి పంపించేయి'' అని. కాని నేనుమాత్రం వాళ్ళమాటలు వినలేదు. నాకు ఆమె భార్య కావాలనే వ్రాసిపెట్టి వుంది కాబోలు. అలాగేఅయింది ఇప్పు డందరూ ఆమెను 'పిచ్చిది' అన్నంత మాత్రాన నే నామెను వదిలెయ్యాలా?''

''అయితే అందరూ అనడమే గాని నీ భార్య నిజంగా పిచ్చిది కాదన్నమాట! మరి నువ్వింతకు ముందే అన్నావుగా ఆమెకు పెళ్ళికిముందే పిచ్చి వుండేదని!'' అరె....ఆమెను తల్చుకుని ఏడుస్తున్నావా?

''ఏడవకుండా ఎలా వుండగలను జగ న్నాథం. నువ్వు ఆమెను 'నీ భార్య ... నీ భార్య' అనే అంటున్నావుగాని. పార్వతి నీ కేమీ కాదా? ఆమె నీ స్వంత చెల్లెలు కాదా? చెప్పు... ''


అప్పటికి నా పొరపాటును గ్రహిం చాను. అతన్నెలాగయినా ఊరడించాలనే ఉద్దేశంతో ''నా చెల్లెలే గాని ఆమె నా కన్నా నీ కెక్కువ ప్రియమైనది. గనుక అలా అంటున్నాను గోపాలం. మరేం లేదు. ఆమెను నువ్వు మనసారా ప్రేమిం చావు కదా మరి?''

నోన్ ఫాక్ట్

ఒకావిడ ఒక బట్టల షాపులోకి వెళ్లి రకరకాల గుడ్డలు చాలా సేపు చూడసాగింది.

''నేను మీకో పెద్ద న్యూసెన్స్‌గా ఉన్నానుకదూ!'' అన్న దావిడ.

షాపువాడు ''నా షాపులో కాతాదారులే ఎప్పుడూ రైటు సుమండీ!'' అన్నాడు.




"ఈ లోకులు కాకులు జగన్నాథం. ఆమె నందరూ 'పిచ్చిదీ....పిచ్చిదీ' అనే ఆడిపోసుకున్నారు గాని నా పార్వతి ఒక్కరోజూకూడా కోపగించుకోలేదు. విసుక్కోలేదు. అసలు నా మాట జవదాట లేదు ఎప్పుడూ. నేను చెప్పినట్టు వినేది. ఎవరయినా పలకరిస్తేనే కాని తనంతట తాను ఎవరితోనూ మాట్లాడేది కాదు. కాని కొంచెం మొద్దు అంతే! నా పిచ్చిగాని ఇవన్నీ నువ్వెరగనివా? ఏదయినా పని చేస్తుంటే అలాగే చేస్తూనేఉండేది. మళ్ళీ పిలిచేదాకా. రోటి ముందు కూర్చుని మారడం మొదలెట్టిందంటే ఎన్నిగంటల సేపైనా అలా నూరుతూనే వుండేది. 'చాలు ఇహ లేచిరా!' అంటేనే లేచొచ్చేది. ఇవే ఆమె చేసే పిచ్చిపనులు. ఇది చూసి 'ఆమెకు పిచ్చి' అని ఎలా అంటాం చెప్పు? అసలు ఈ లోకంలో అందరూ మంచివాళ్ళే వుంటారా జగన్నాథం? అత నింకా ఏదో చెబుతున్నాడు. అంతలో నేను లేవబోయాను.

"అరె ...లేస్తున్నా వేమిటి కూర్చో ...." అన్నాడు.

నా కెందుకో మాటలు తడబడ్డాయి.

"లే.... లేదు నాకు ఆలశ్య మవుతుంది వెళ్ళాలి" అన్నాను.

"అలా గాభరాపడతావేం జగన్నాథం? అప్పుడు నీ మీద కోపం వచ్చిందిగాని ఇప్పుడు లేదుగా. కూర్చో .... కూర్చో' అన్నాడు.

"కూర్చుంటానుగాని నువ్విలా గట్టిగా అరచి మాట్లాడకూడదు. చూసినవాళ్ళు ఏమనుకుంటారు?" అంటూ లేచినవాణ్ని మళ్ళీ చతికిలపడ్డాను.

"ఆ రోజు మా వసుంధరను నీ కప్పచెప్పడానికి వచ్చినప్పుడు దాని వయసు రెండేళ్ళు వంటింట్లో సీతాకాకగారి గొణగడం విన్నాను ఇప్పటికీ గుర్తుంది ఆ మాట. 'ఏదో నాలుగురోజులంటే ఉంచుకోవచ్చు గాని జన్మంతా మనమే భరించాలంటే ఎలా? అందులోనూ ఆడపిల్ల. పెద్దయ్యాక పెళ్ళీ పెటాకులూ చెయ్యాలి' అప్పుడు నువ్వేమన్నావో జ్ఞాపకముందా? వసుంధర పరాయిదికాదు. నా స్వంత చెల్లెలికూతురు. మనకూ ఉన్నారుగా ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళతోబాటు అదీ వుంటుంది' అన్నావు. ఆ తరువాత ఆవిడ నోరెత్తలేదు, ఆ రోజు నాకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు...."

అతనింకా ఏదోచెబుతుండగామధ్యలో కుతూహలం పట్టలేక అడిగాను. 'మరి మీ అమ్మాయిని మా ఇంట్లో ఎందుకు వొదిలిపెట్టావ్? అదంటే నీ కిష్టంలేదా? ప్రస్తుతం అతని దృష్టిలో నేనేకదా జగన్నాథం!

'ఆఁ... ఏమిటీ? ఏమన్నావ్? మా అమ్మాయంటే నాకు ఇష్టంలేదా? ఆమాట మరోసారి అన్నావంటే చూడు!"

అతను ఆవేశంతో ఊగిపోతూ లేచి నిలబడ్డాడు. నే నతన్ని పట్టుకొని కూర్చో బెట్టి "కూర్చో గోపాలం....కూర్చో.... అంత కోపమెందుకు?" అన్నాను.

"నా ఒక్కగా నొక్క కూతురే నా కిష్టంలేకపోతే ఇంకెవరిమీద ఇష్టముంటుం దనుకున్నావ్? నీ కూతుళ్ళమీదా? ముందు వసుంధరను మీ ఇంట్లో వదలిపెట్టడానికి గల కారణం నీతో చెప్పాను. నువ్వు సరేనన్న తరువాతే తీసుకొచ్చి వదలి పెట్టాను మీ ఇంటిలో...."

నేను నాలిక్కరుచుకొని సర్దుకుంటూ "మరచిపోయాను గోపాలం' అన్నాను.

కుక్కాలాజి

"మీ యింట్లో భోజనం చేసేముందు ప్రార్థన చేస్తారా?" అన్నాడు సుబ్బారావు.

"అబ్బే! అదేం లేదు! మా ఆవిడ వంటబాగానే వండు తుంది" అన్నాడు బుచ్చారావు.

—కె. రమాదేవి.

అతను మళ్ళీ చ(క్రుమని లేచాడు నా మీదికి.

"మరచిపోయావా? ఎలా మరచిపో గలిగావ్?''

''నువ్విలా గట్టిగా అరిచావంటె నే వెళ్ళిపోతా నంతే!'' మళ్ళీ బెదిరించా నతన్ని.

"నేనేం గట్టిగా అరవడంలేదు. నీ కలా వినిపిస్తోందేమో అంతే. నీకు తెలీదు జగన్నాథం....పార్వతి నెలకోసారి నాలుగురోజులపాటు మామూలు మనిషి అయ్యేది. అలాంటి సమయంలో చాలా తెలివిగా (ప్రవర్తించేది. అప్పుడు ఆమె ఏ పని చేసినా సవ్యంగా చేసేది పెళ్ళికి ముందు కూడా ఆమె అప్పుడప్పుడు అలాగే (ప్రవర్తించేదటగా? నీకు తెలీదా? లేక ఇదీ మర్చిపోయావా?''

''ఆఁ.. అవునవును ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది'' అన్నాను.

నా పరిస్థితి నాకే నవ్వొచ్చిందప్పుడు.

''అలాంటప్పుడే ఓసారి పార్వతి ఏం చెప్పిందో తెలుసా? 'వసూ ఆడపిల్ల, అది ఇక్కడే వుంటె పెద్ద దవుతున్న కొద్దీ నా (ప్రభావం దానిమీద పడకపోదు. పరిణామం ఎలావుంటుందో చెప్పలేం. అందుకని దాన్ని మా అన్నయ్యదగ్గర ఉంచుదాము. అక్కడే పెరగని అది. అన్నయ్య నడిగితే కాదనడు. మీరు వెళ్ళి అడగండి' అని. ఇంత తెలివి మంచివాళ్ళకయినా వుంటుందంటావా జగన్నాథం?''

''ఎలా వుంటుందీ... ఉండదు. అతని మాటలను సమర్థించాను.

"అలా మధ్య మధ్యలో అద్భుతగలకు జగన్నాథం. నన్ను చెప్పనీ ....నేను ముందే నీకు అంతా వివరంగాచెప్పి,తరువాత వసూను తీసుకొచ్చి మీ ఇంటిలో దిగబెట్టాను అప్పుడు మీ చెల్లెలి ఆలోచన చాలా బాగుందని మెచ్చుకున్నావు. ఇప్పుడేమో మరచిపోయా నంటున్నావు...."

''ఇక చాలిద్దాం గోపాలం. ఇంటికి వెళ్ళాలి. అన్నట్టు మీ ఇల్లెక్కడ?'' అనడిగాను.

అతను ఉన్నట్టుండి పెద్దగానవ్వాడు.

"ఇల్లు....పెళ్ళాం పోయాక కూడా ఇల్లుంటుందా ఎవరికయినా? ఇల్లూ, వాకిలీ ఏనాడో వదిలేశాను. హాయిగాఇష్టంవచ్చిన చోట తిరగడమే నా పని ఇప్పుడు...."

''ఓహో! అలాగా!'' అన్నాను.

''నా పార్వతి చచ్చిపోయిన కొన్నాళ్ళకే నన్ను ఉద్యోగంలోంచి తీసేశారు. ఎందుకని అడిగితే పెళ్ళాం చచ్చిపోగానే నీకు మతి పోయిందన్నారు. 'గోపాలం పిచ్చివాడు 'అని సర్టిఫికేట్ కూడా ఇచ్చారు. ఈ జనానికేమన్నా బుద్ధుందా జగన్నాథం? పెళ్లాం చనిపోగానే మొగుడికి పిచ్చిపట్టాలని రూలేమయినా ఉందా ఏమిటి?''

"ఛ! .... ఛ .... అలా అని ఎవరంటారు?''

"అయితే పెళ్ళాంమీద ప్రేమవుండడం పిచ్చికాదంటావు అవునా?"

''ముమ్మాటికీ కాదు. పెళ్ళాం మీద ప్రేమ అందరికీ వుంటుంది. దాన్ని పిచ్చి అన్నవాళ్ళకు బుద్ధిలేదు అంతే! ఆఁ.... ఇహ అయిందా నీ రెండు నిముషాలపైన? నువ్వు చెప్పవలసింది కూడా పూర్తయిందనుకుంటా .... వస్తా!'' అంటూ లేవబోయాను.

''ఆఁ .... ఆఁ ... ఆగు జగన్నాథం ఇంకా పూర్తికాలేదు. నా కోరిక ఒక్కటే నీతో మొరబెట్టుకోవియ్యి''

''సరే అయితే ఆకోరికేమిటో చెప్పు'' అని మళ్లీ కూర్చున్నాను.

"నాకున్నది ఒక్కటే కోరిక. అదేమిటంటె మా వసూను నువ్వు పెంచిపెద్ద చేశావు. ఆమెకు మంచి వరుణ్ణి చూసి పెళ్ళి చేసెయ్యి. ఈ ఉపకారం నా జన్మలో మరచిపోను. ఇంకోమాట జగన్నాథం....ఆమె పెళ్ళికి నన్ను తప్పక పిలవాలి. నేనెక్కడున్నా, ఏ ఊళ్లోవున్నా పెతికించి మరీ పిలవాలి. నా వసూ పెళ్ళికి నేను తప్పకుండా వస్తాను. రెండు చేతుల్తోనూ అక్షింతలు వేస్తాను. ఒక చేత్తో నాది. ఇంకోచేత్తో పార్వతిది. అర్థమయిందా? ఇదొక్కటే నాలో మిగిలిన కోరిక ఆకాస్తా అయిపోతే నాకింకేం అక్కర్లేదు. సంతోషంతో చచ్చిపోగలను....''

ఈ మాటలు చెబుతూంటె నా చిరాకంతా మాయమయి అతనిమీద జాలి కలగసాగింది నాకు.

''అయితే నీ భార్యా కూతుర్ని చూడకుండానే చనిపోయిందన్న మాట? ఆ తరువాత నువ్వు మీ అమ్మాయిని చూడనే లేదా?'' అనడిగాను కుతూహలం ఆపుకోలేక.

''చూశావా....ఇలాంటి సందేహాలన్నీ నీ మనసులో వున్నాయనే కదా, నేను ఇందాకటినుంచీ చెపుతున్నా. ఇప్పుడు నిజంగా రెండంటే రెండే నిముషాల్లో వాటిని తీర్చేస్తా....నేను ఎన్నేళ్ళనుంచో

యైత్ వండర్

● "మీరు అమ్మిన ఎలుకల బోను-'ఎలుకలకు అద్భుతమైనవి' అన్నారు. పది రోజులుగా ఒక్క ఎలుక అందులో పడ లేదు!" అన్నాడు బోను కొన్నాయన.
"చూశారా-నేను ఎంత నిజం చెప్పానో! ఎలుకలకు అది అద్భుతమైన బోను కాదంటారా?" అన్నాడు షాపువాడు.

అనుకుంటున్నాను నువ్వు ఎప్పుడో ఒక సారి నాకంటబడక పోవదీ....అప్పుడు నీ కన్నీ చెప్పగలననీ ఆ అవకాశం ఇప్పుడు దొరికింది. నాకు ఈ రోజు అనుకోకుండా నువ్వు కలిశావు ఇప్పటికైనా నీ అనుమానాలన్నీ తీర్చడం నా కర్తవ్యంగదా?

"ఏం కర్తవ్యమో ఏమో। నన్ను చాలాసేపు కూర్చోపెట్టేశావు. మొత్తానికి" అన్నాను.

"అవును జగన్నాథం నిన్ను చాలాసేపు కూర్చోబెట్టేశాను. ఇహ రెండే నిముషాలు....తరువాత...."

అతనింకా ఏదో చెబుతూండగా మధ్యలో నేను కల్పించుకొని "ప్రాణం పోయే ముందైనా ఆమెకు వసుంధరను ఎందుకు తీసుకొచ్చి చూపించలేదు;" అనడిగాను.

"ఏం చెప్పమంటావు జగన్నాథం. పార్వతి నన్ను వదలి శాశ్వతంగా వెళ్ళి పోతుందని కలలోనైనా ఊహించలేదు నేను. అసలు డాక్టరే ఊహించలేక పోయాడు మూడు రోజులు వరసగా జ్వరం వచ్చిందంతే, జ్వరమంటె ఉత్త మామూలు జ్వరంకాదు, విషజ్వరం. మూడో రోజు మధ్యాహ్నం ఆమె ఆ జ్వరంలోనే నన్ను ఇష్టం వచ్చినట్టు తూలనాడింది. పెళ్ళయి నప్పటినుంచీ ఎప్పుడూ మాటకు మాట జవాబుచెప్పడం కూడా ఎరగని పార్వతి ఒక్కసారిగా అలా విరుచుకు పడేటప్పటికి నాకూ కాలూ చెయ్యీ ఆడలేదు.

"ఎందుకలా కోప్పడింది॥"

"నాదురదృష్టం జగన్నాథం। వసూను నా కెందుకు దూరం చేశారు? నా కూతుర్ని నా దగ్గరుండకుండా అన్నయ్యదగ్గరెందుకు వదిలిపెట్టారు?" అని ఇంకా ఏమేమో అంది.

"అదేమిటి? తనేగా చెప్పింది. అన్నయ్యదగ్గర వదలి పెట్టమని?" నేను ఆశ్చర్యంతో అడిగాను.

"నేనూ అలాగే అన్నాను జగన్నాథం. 'పార్వతీ' ఎందుకిలా అర్థం లేకుండా అరుస్తావ్' నువ్వేగా చెప్పావు. అక్కడుంటె నా ప్రభావం దాని మీద పడుతుంది. తీసుకెళ్ళి అన్నయ్యకప్ప చెప్పండి' అని? ఇప్పుడెందుకిలా మాట్లాడుతున్నావు? అని ఎంతో నచ్చ చెప్పి చూశాను. కాని ఆమె వినిపించు కోలేదు కళ్ళు పెద్దవి చేసుకుని పళ్ళు పటపటా కొరికింది. "నేను చెప్పానే అనుకోండి. మీ రెందుకు వద్దనలేదు? మంచీ చెడ్డా ఆలోచించే శక్తికూడాలేని మీరూ ఒక భర్తేనా? భార్య తప్పుచేస్తే భర్త సరిదిద్దాలి. అదిపోయి మీరే తప్పును తెలిసి చేశారా? అబ్బ! ఎలాంటి భర్త దొరికాడు, బాబూ నాకు? అన్యాయంగా అన్నయ్యే చేశాడు తనేమో హాయిగా

సుఖంగా వున్నాడుగాని నాకు మాత్రం ఇలాంటి భర్తను అంటగట్టాడు. తల్లి నుండి బిడ్డను వేరుచేసే కఠినుడు ...అని ఒకటే గోల పెట్టేసింది."

'పోనీ వసూను పిలిపించి వుంటె సరి పోయేదిగా దానికింత గొడవెందుకు?' అన్నాను.

"నేనూ అదే చెప్పాను! వసూను పిలి పిద్దాం పార్వతీ నువ్వేం గాభరాపడకు నీకు తప్పక నయమయిపోతుంది. డాక్టరు కూడా అదే చెప్పాడుగా? ఇదుగో ఇప్పుడే జగన్నాథానికి టెలిగ్రాం ఇస్తాను. అది అందగానే వసూను తీసుకుని అతను రేపే వచ్చేస్తాడు నువ్వు ఊరికే కంగారుపడకు" అని కాని ఆమె వింటేగా జగన్నాథం పేరెత్తగానే మరింత మండిపడింది. "ఛీ! ఆ పాపిష్ఠి వాడి మొహం నేను చూడను వాడు నా తోడ బుట్టినవాడు కాడు. నా శత్రువు. "అని ఇంకా ఏమేమో అంది. కాని నువ్వుమాత్రం ఇవేవీ సీరియస్‌గా తీసుకోకు సుమా! ఆమెకు వాతంకమ్మి ఆమెచేత అలా వాగించింది గాని లేక పోతె అలా మాటాడే మనిషే కాదు పార్వతి. ఆమె మనసెంతో మంచిది ఆ తరువాత నేను డాక్టరును పిల్చు కొచ్చాను ఆయన పార్వతిని చూసి ఒక ఇంజక్షను ఇచ్చి మరేం భయంలేదని ఆమెకూ నాకూ ధైర్యం చెప్పి వెళ్ళి పోయాడు.... కాని మరొక అర్ధ గంటలో ఎవరూ ఊహించని విధంగా ఆమె ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది. ప్రాణం పోయేముందు ఆమె అన్న చివరిమాట ఏమిటో చెప్పనా? 'హుం .... రామా నారాయణా! నా చివరి ఘడియల్లో కూడా కూతురిని ఒక్కసారి చూసుకునే యోగం లేక పోయింది కాదా నాకు?' అంటూ వుండగానే ఆమె తల పక్కకు వాలి పోయింది. అప్పుడే అక్కడే ఆమె శిరస్సుపై చెయ్యివుంచి "పార్వతీ ...నీ చివరి ఘడియల్లో నైనా కూతురిని చూపించలేని అసమర్థుణ్ని నేను కూడా ఇహ జీవితాంతం కూతురు మొహం చూడను. "అని ప్రతిజ్ఞ చేసుకున్నాను. ఇప్పుడర్థమైందా జగన్నాథం? ఇంకే మన్నా సందేహాలున్నాయా నీకు?"

"లేదు గోపాలం ఇంకే సందేహాలూ లేవు ఇహ నేనెళ్ళొస్తా!" అన్నాను.

"ఇహ వెళ్ళొస్తా జగన్నాథం నేను చెప్పింది మరచిపోకు" అంటూ అతనా సిమెంటు బెంచీకి చేరగిలబడి కళ్ళుమూసు కున్నాడు.

నేను అక్కడినుంచి బయలు దేరాను •